ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల జిల్లా వార్తలు
5
శుక్రవారం 26 జనవరి 2024



అమ్మో సన్న బి(భ)య్యం



- క్వింటాలుకు రూ. 5 వేల నుంచి రూ. 6 వేలు పలుకుతున్న ధర
- వినియోగం అధికమవడంతో పెరుగుతున్న రేట్లు
- గత యేడాది కంటే రూ. 1500 వరకు అదనం
- జిల్లాలో సన్నాల సాగు 20 వేల ఎకరాలే

జగిత్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సన్నరకం ధరలకు రెక్కలొచ్చాయి. జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో తగ్గిన సన్నాల సాగుతో బియ్యం ధర చుక్కలనంటుతోంది. పలు రకాల కారణాలతో రైతులు సన్నరకం వరి పండించడానికి విముఖత చూపడంతో సన్నబియ్యం ధరపై తీవ్ర ప్రభావం పడింది. గతేడాదితో పోలిస్తే ఏకంగా రూ. వెయ్యికి పైగా ధర పెరిగింది. పలు ప్రాంతాల్లో పండించిన రైతే ధాన్యాన్ని మిల్లులో పట్టించి వినియోగదారులకు విక్రయిస్తున్నారు. క్వింటాల్ బియ్యాన్ని రూ. 5 వేల నుంచి రూ. 6 వేల వరకు అమ్ముతున్నారు. ప్రధానంగా వ్యాపారులు సైతం బహిరంగ మార్కెట్‌లో ధర పెంచి అమ్ముతున్నారు.

దొడ్డు బియ్యం సాగు పెరగడం, సన్నాల సాగు తగ్గడం, ప్రజలు తినడానికి సన్నబియ్యాన్ని ఒకేసారి ఏడాదికి సరిపడా కొనుగోలు చేస్తుండడంతో మార్కెట్లో డిమాండ్ పెరిగింది. అలాగే పొరుగున ఉన్న మహారాష్ట్రలోని ముంబై, నాగ్ పూర్, బీవండి, నిజామాబాద్, కరీంనగర్, హైదరాబాద్ తదతర ప్రాంతాల్లో నివసిస్తున్న తమ కుటుంబ సభ్యుల కోసం కూడా జిల్లాలో బియ్యం కొనుగోలు అధికంగా జరుగుతుండడంతో ధరలు పెరిగాయి.

పెట్టుబడి ఎక్కువ..దిగుబడి తక్కువ

వరిసాగు విధానంలో రైతులు దొడ్డు, సన్నరకం ధాన్యం పండిస్తున్నా రు. రోజురోజుకూ పెరుగుతున్న పెట్టుబడులు, వాతావరణంలో మార్పులు, చీడపీడలతో సన్నరకం దిగుబడి తక్కువగా వస్తోంది. దీంతో రైతులు స న్నాలు పండించడానికి విముఖత చూపుతున్నారు. ప్రభుత్వ ధాన్యం కొను గోలు సంస్థల్లో, మిల్లర్లు కూడా సన్న వడ్ల కంటే దొడ్డు రకాన్ని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. వీటితో పాటు కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు రకానికి క్వింటాల్‌కు రూ. 2,060 లభిస్తుండగా, సన్నాలకు రూ. 2040 లభిస్తుంది. దీంతో రైతులు సన్నాల సాగును భారీగా తగ్గించారు.

సామాన్యులకు భారంగా..

సన్నరకం ధాన్యం తింటున్న సామాన్య, పేద ప్రజలకు పెరుగుతున్న ధరలు భారంగా మారుతున్నాయి. అయినప్పటికీ పేద, మధ్య తరగతి నుంచి సంపన్న కుటుంబాల వరకు 90 శాతం సన్న బియ్యం (బీపీటీ) తింటున్నారు. కొందరు రైతులు సన్న వడ్లను బియ్యం పట్టించి తమ కుటుంబ అవసరాలకు పోను మిగితావి విక్రయిస్తున్నారు. గతేడాది వానాకాలంలో రూ. 4,500 నుంచి 5000 వరకు క్వింటాల్ చొప్పున సన్న బియ్యం అమ్మారు. ఈసారి మొదట్లో రూ. 5000 నుంచి 5200 వరకు అమ్మారు. దిగుమతి తగ్గడం, డిమాండ్ పెరగడంతో రూ. 5,500 నుంచి రూ. 6,000 వరకు అమ్ముతున్నారు. ఇక బహిరంగ మార్కెట్లో అయితే సన్నాల ధర అమాంతం పెంచేశారు. పాత బియ్యం రూ. 6,200లకు క్వింటాల్ అమ్ము తూ కొత్త బియ్యం రూ. 5,500 వరకు అమ్ముతున్నారు. కొన్ని రకాల బియ్యమైతే పాత రకం రూ. 5,500 నుంచి రూ. 6 వేలు వరకు అమ్ముతున్నారు. ధరలు పెంచి అమ్ముతున్న వ్యాపారులపై అధికారుల నియంత్రణ లేకుండా పోయిందని పేద, మధ్యతరగతి వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

సన్నాల సాగు తగ్గడం వల్లే...

ఈ సారి సన్నాల సాగు తగ్గింది. సన్నాలు వస్తాయని మార్కెట్‌లో ఉన్న ధాన్యం విక్రయించారు. దీంతో సన్నబియ్యం కొరత ఏర్పడింది. వినియో గదారుల అవసరాలకు అనుగుణంగా సరిపోను బియ్యం లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో కొత్త, పాత బియ్యం ధరలు పెరిగాయి. జిల్లాలో గడిచిన మూడేళ్లుగా వరిసాగు గణ నీయంగా తగ్గుతుంది. ప్రధానంగా సన్నరకం పండించే ఈ సీజన్‌లో సు మారు 3.50 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇందులో కేవలం సు మారు 20 వేల ఎకరాల్లో మాత్రమే సన్నాలను సాగు చేశారు. జిల్లాలో ఏ టేటా సన్నరకం సాగు తగ్గుతూ వస్తోంది.

కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది

- అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటాం
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



మెట్‌పల్లిలో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

మెట్‌పల్లి, జనవరి, 25 : రాష్ట్రలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ కక్ష పూరితమైన రాజకీయాలను చేస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మెట్‌పల్లిలోని కోరుట్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావుతో కలిసి విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అభి వృద్ధిని పక్కనపెట్టి, బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై అక్రమ కేసులు పెడుతూ బెదిరింపులకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు.

తెలంగాణ కోసం ఎదురొడ్డి పోరాడిన బీఆర్ఎస్ పార్టీ అక్రమ కేసులకు భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అధికారంలో ఉన్నామని కక్షపూరితంగా అవలంబిస్తున్న తీరు సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ రానావేణి సుజాత-సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఘన స్వాగతం

జగిత్యాల: జిల్లాలో పర్యటించడానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు గురువారం ఘన స్వాగతం లభించింది. జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ దంపతులు పూలమొక్క అందించి స్వాగతం పలికారు. కార్యకర్తలు, పార్టీ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తలు, నాయకులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

రాయికల్: రాయికల్ మండలం ఇటిక్యాల సాయిబాబా ఆలయంలో కొనసాగుతున్న మహా కుంబాభిషేకం కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్సీ కవిత గురువారం జరిగిన పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, జడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్, మాజీ కేంద్ర మంత్రి అశోక గజపతి రాజు, సాయప్ప ట్రస్ట్ చైర్మన్ సీ హెచ్ఎస్‌వీ నివేదిత కృష్ణారావు, వైస్ చైర్మన్ హి మవంత రావు, గ్రామస్థులు ఉన్నారు.

ఓటు హక్కును వినియోగించుకుంటేనే సత్ఫలితాలు

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతరులు

జగిత్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుంటేనే సత్ఫలితాలు అందుతాయని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా జ్యోతిని వెలగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమావేశానికి హాజరైన వారంత ఓటరు ప్రతిజ్ఞను సామూహికంగా చేశారు. జిల్లాలో సీనియర్ సిటిజన్ ఓటర్లకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గత శాసన సభ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో జిల్లా అధికార యంత్రాంగం కృషి అభినందనీయమన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఓటు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంటుందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలల్లో సైతం జిల్లా అధికార యంత్రాంగం, రాజకీయ పార్టీలు, మీడియా, వివిధ వర్గాల వారితో పాటు యంగ్ ఓటర్లు సహకరించి ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కృషి చేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, నోటాను కూడా ఉపయోగించుకునే అవకాశం ఉన్నందున పోలింగ్‌లో పాల్గొనాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు బీఎస్ లత, దివాకర, స్వీప్ జిల్లా అధికారి లక్ష్మీనారాయణ, డీఆర్‌డీఏ నరేశ్, జిల్లా ఎన్నికల విభాగం తహసీల్దార్ హకీం, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

'అర్బన్ మండలంలో మరిన్ని గ్రామాల విలీనానికి కృషి'



మండలపరిషత్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్

జగిత్యాలరూరల్, జనవరి 25 : జగిత్యాల అర్బన్ మండలంలో మరికొన్ని గ్రామాలు విలీనం చేయడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. ఎంజీఎన్ ఆర్ఇజిఎస్ నిధులు రూ. కోటి రూపాయలతో నూతనంగా నిర్మించిన జగిత్యాల అర్బన్ మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీచైర్‌పర్సన్ దావ వసంతసురేశ్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పల్లెల రూపురేఖలు మారిపోయాయని, పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా మాజీ సీఎం కేసీఆర్ ప్రతి నెల నేరుగా పంచాయితీలకు జనాభాప్రాతిపదికన నిధులు విడుదల చేశారన్నారు. జాతీయస్థాయిలో స్వచ్ఛ సర్వేక్షన్‌లో మొదటి 20 స్థానాల్లో 19 తెలంగాణకే అవార్డులు దక్కాయని గుర్తు చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ ములాసపు లక్ష్మీ, జడ్పీటీసీ మహేష్, ఎంపీడీవో శైలజారాణి, ప్యాక్స్‌చైర్మన్ మహిపాల్‌రెడ్డి, సర్పంచులు గొడిశెల గంగాధర్‌గౌడ్, డెక్క ప్రభాకర్, ఎంపీటీసీలు రొక్కంరాజశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎంఈవో గాయత్రి, ఎంపీవోలు సలీం, రవిబాబు, నాయకులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రిపబ్లిక్ వేడుకలకు ఏర్పాట్లు



రిపబ్లిక్ డే వేడుకలకు ముస్తాబైన కలెక్టరేట్

జగిత్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రిపబ్లిక్ డే ఉత్సవాలకు కలెక్టరేట్ కార్యాలయం ముస్తాబైంది. అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. సమీకృత జిల్లా భవనముల సముదాయంలో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా జాతీయ పతాకావిష్కరణ జరుపనున్నారు. అనంతరం పోలీస్ పరేడ్, వంద స్వీకారం, కలెక్టర్ సందేశం, సాతంత్ర్య సమరయోధులకు సత్కారం, వివిధ రంగాల్లో కృషి చేసిన వ్యక్తులకు ప్రశంసా పత్రాల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు, వందన సమర్పణ తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను కలెక్టర్, ప్రజాప్రతినిధులు సందర్శించి పరిశీలన చేయనున్నారు. సాయంత్రం సమయంలో వివిధ కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

రాబోయే కాలంలో హీరోలు మీరే

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



సమావేశంలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్

ధర్మపురి, జనవరి 25: రాబోవు కాలంలో హీరోలు మీరే అంటూ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సర్పంచులను కొనియాడారు. ధర్మపురిలో పదవీ కాలం ముగింపు సందర్భంగా నియోజకవర్గ స్థాయి బీఆర్ఎస్ సర్పంచుల సన్మాన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కొప్పుల ఈశ్వర్ సర్పంచులను ఉద్దేశించి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచులు భూమిక ఎనలేనిదన్నారు. కరోన సమయంలో కూడ గ్రామాల్లో అభివృద్ధికి రూ 1600 కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఖర్చు చేసిందని గుర్తు చేశారు. అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ అబద్దాలు చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. ఆరు నెలల తరువాత కాంగ్రెస్ ప్రభుత్వ పని తీరు తెలుస్తుందన్నారు. బీఆర్ఎస్ పట్ల కాంగ్రెస్ కక్ష్యపూరిత రాజకీయాలకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, జడ్పీటీసీలు అరుణ, జలంధర్, రాజేందర్‌రావు, వెల్గటూర్ ఎంపీపీ కూనమల్ల లక్ష్మి, ఏఎంసీ చైర్మన్ అయ్యోరు రాజేష్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామయ్య, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షులు గంగారెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షులు సౌళ్ల భీమయ్య పాల్గొన్నారు.

ఎలిగేడు వాసికి పురస్కారం

ఎలిగేడు, జనవరి 25: మండల కేంద్రానికి చెందిన చెల్లోజ శ్రీనివాస్‌బాబు జాతీయ స్థాయి నంది అవార్డుకు ఎంపికయ్యాడు. యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద, సుభాష్‌చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆర్టిస్ట్ చెల్లోజ శ్రీనివాస్‌బాబు చిత్రకళ రంగంలో విశిష్టమైన కృషి చేసినందుకు గాను తెలుగు వెలుగు నుంచి జాతీయ పురస్కార నిర్వహణ కమిటీ చైర్మన్ బ్రహ్మశ్రీ డాక్టర్ వెలబోజు మోహన్‌రావు, కోఆర్డినేటర్ పోలోజు రాజ్‌కుమార్ చార్యులు జాతీయ పురస్కారం అందుకోనున్నట్లు చెల్లోజ తెలిపారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

హుజూరాబాద్ జిల్లా సదస్సు కరపత్రాల ఆవిష్కరణ

హుజూరాబాద్, జనవరి 25: హుజూరాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పీవీ పేరుతో హుజూరాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం జిల్లా జేఏసీ నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ నెల 28న హుజూరాబాద్‌లోని సిటీ సెంట్రల్ హాల్‌లో పీవీ జిల్లా కోసం జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సదస్సుకు 13 మండలాలకు చెందిన అన్ని పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, కవులు, కళాకారులు, మేధా వులు, అంబేద్కర్ వాదులు, యువకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సదానందం, వెంకటరాజం, రవీందర్‌రెడ్డి, రత్నం, ఈశ్వర్‌రెడ్డి, రాజన్న, శేఖర్, జగన్నాథం, ముక్కెర రాజు, హరిహరన్, అయిలయ్య, అశోక్, వంశీకృష్ణ, ప్రభాకర్, హరికృష్ణగౌడ్, లింగమూర్తి, మల్లయ్య, రాజు, శ్రీనివాస్, స్రవంతి, భానుచందర్, అశోక్, వెంకటరెడ్డి, ప్రభాకర్, సతీష్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల్లో నారాయణపూర్‌కు ఎల్లంపల్లి నీరు

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర, జనవరి 25: రెండు రోజుల్లో నారాయణపూర్ రిజర్వాయర్‌కు ఎల్లంపల్లి నీరును పంపిణీ చేసి పంటలను కాపాడుతామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. నందిమేడారం పంపు హౌస్ పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంపు హౌస్ పనులు త్వరగా పూర్తి చేసి ఎల్లంపల్లి నీరు విడుదల చేయాలని నీటి పారుదల శాఖ ఈఎన్‌సీతో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. నారాయణపూర్ రిజర్వాయర్ ఆయకట్టు చివరి మడి వరకు సాగునీరందిస్తామని తెలిపారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట చొప్పదండి మున్సిపాల్ చైరపర్సన్ గుర్రం నీరజ భూం రెడ్డి, గంగాధర జడ్పీటీసీ పుల్కం అనురాధ నర్సయ్య, చొప్పదండి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బండపల్లి యాదగిరి, మునిగాల చందు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

రాయికల్, జనవరి 25: ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. రాయికల్ మండల లోని ఇటిక్యాల గ్రామానికి చెందిన అంకతి శ్రీనివాస్ (36) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బుధవారం రాత్రి ద్విచక్రవాహనంపై తన స్నేహితుడు దువ్వాక నాగరాజును కూర్చోబెట్టుకుని ఒడ్డెలింగాపూర్‌కు వెళ్లి వస్తుండగా భూపతిపూర్ గ్రామ శివారులో మూల మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన గల ఇనుప రెయిలింగ్‌కు ఢీకొట్టాడు. దీంతో శ్రీనివాస్ తలకు బలమైన గాయం కావడంతో ఆస్పత్రికి తరలించే క్రమంలో మరణించాడు. నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. శ్రీనివాస్ తండ్రి లింగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

గంగాదర: గంగాధర మండలం లక్ష్మీదేవిపల్లిలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై ఫుల్ల అభిలాష్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లికి చెందిన దాసరి మల్లయ్య(60), అదేగ్రామానికి చెందిన లింగయ్య గురువారం గంగాధరకు పనినిమిత్తం బైక్‌పై వెళ్లారు. సాయంత్రం ఇంటికి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా లక్ష్మీదేవిపల్లి శివారులో రోడ్డుపక్కన ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వాహనం నడుపుతున్న మల్లయ్య తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనకాల కూర్చున్న లింగయ్యకు కాళ్లు విరిగాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌లో ఖని ఎన్‌సీసీ కెడెట్లు


కెడెట్లు రిజియాన్, హైమ

కోల్‌సిటీటౌన్, జనవరి 25: ఢిల్లీలో శుక్రవారం జరిగే 75వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు ఎన్‌సీసీ కెడెట్లు రిజియాన్, బొజ్జ హైమ పాల్గొనేందుకు ఎంపి కయ్యారు. ఆర్మీ వింగ్ తరుపున రిజియాన్, హేర్ వింగ్ తరుపున బొజ్జ హైమలు తెలంగాణ, ఏపీ డైరెక్టరేట్ నుంచి పాల్గొం టున్నారు. కాగా దేశ ప్రధాని నరేంద్రమోదీకి గౌరవ వందనం చేయనున్నారు. కాగా పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు పాల్గొనడం జిల్లాకు, పాఠశాలకు ఎంతో గర్వకారణమని పాఠశాల కరస్పాండెం ట్ లవ్‌లీజాకబ్, ప్రిన్సిపల్ జ్యోత్స్న, ఎన్‌సీసీ ఆఫీసర్ జ్యోత్స్న, ప్రైమరీ ఇన్‌ఛార్జి ఇన్నమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆదివరహాస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గంగుల


కుటుంబీకులతో కలిసి మొక్కులు చెల్లించుకుంటున్న గంగుల

కమాన్‌పూర్, జనవరి 25: మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఆదివరహా స్వామిని గురువారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, సర్పంచ్ నీలం సరిత,దేవస్థాన డైరెక్టర్ దండే కనకరత్నం, యూత్ అధ్యక్షులు బొమ్మగాని అనిల్‌గౌడ్ ఉన్నారు.

ఆయిల్ పామ్ తోటలను సందర్శించిన జగిత్యాల రైతులు

అశ్వారావుపేట, జనవరి 25: జగిత్యాలకు చెందిన సుమారు 150 మంది పామాయిల్ రైతులు గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట, దమ్మపేటలో మండలాలలో పలు పామాయిల్ క్షేత్రాలను సందర్శించారు. పామాయిల్ రైతులు విజ్ఞాన విహారయాత్రలో భాగంగా పామాయిల్ నర్సరీల పెంపకం, క్షేత్రాలు, సాగు విధానం, నీటి యాజమాన్యం, ఎరువుల యాజమాన్యంపై అవగాహనకోసం అశ్వారావుపేటలోని పామాయిల్ నర్సరీని సందర్శించారు. అనంతరం నారంవారిగూడెంలోని పామాయిల్ తోటలను రైతులు అశ్వారావుపేట ఆయిల్‌ఫెడ్ అధికారులు చూపించారు. అనంతరం దమ్మపేట మండలంలోని అప్పారావుపేట ఫ్యాక్టరీని చూపించి, ఉత్పత్తి అయిన పామాయిల్ గెలల క్రషింగ్ విధానంపై రైతులకు వివరించారు.

కొండగట్టులో ఆగని అదనపు వసూళ్లు

● ఇబ్బందులు పడుతున్న భక్తులు ● పట్టించుకోని ఆలయ అధికారులు

మల్యాల, జనవరి 25: కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనానికి వచ్చే భక్తులు దేవస్థానం పరిధిలో అడుగడుగునా దోపిడీకి గురవుతున్నారు. కొండ ఎక్కింది మొదలు దిగే వరకు నిలువు దోపిడీ భారిన పడుతున్నారు. ఏళ్లుగా ఇదే తంతు సాగుతున్నా దేవాదాయ శాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని హిందూ ధార్మిక సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. కొండపైన గుట్కాల విక్రయం, అధిక ధరల దోపిడీతో భక్తుల మనోభావాల్ని దెబ్బతీస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొండగట్టు అంజన్న సన్నిధిలో కొబ్బరికాయ నుంచి అన్ని వస్తువులను కొనాలంటేనే భక్తులు జంకుతున్నారు. మార్కెట్ ధరలకు అదనంగా 10శాతం హెచ్చు ధరలతో కొండపైన వస్తువులు విక్రయించాలని పేర్కొంటున్నప్పటికీ ఇక్కడ అధిక ధరలకు అమ్ముతున్నారని కొందరు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. కొండపైన గల అన్ని దుకాణాల్లో దోపిడీ జరుగుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. లాకర్ రూం, కిరాణం, కూల్‌డ్రింక్స్, హోటల్, ఫొటోస్టూడియో, బొమ్మలు, పూలు, పండ్లు అమ్మకం వద్ద కూడా భక్తులు దోపిడీకి గురవుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. చివరకు చెప్పులు భద్రపరచడం చోట, మరుగుదొడ్ల వద్ద కూడా అధికంగా వసూలు చేస్తున్నారు. వాహన పూజలకు టికెట్టు తీసుకున్నప్పటికీ భక్తుల వద్ద వాహనాన్ని బట్టి అర్చకులు, అక్కడి సిబ్బంది వందల్లో వాహనాదారుల వద్ద వసూలు చేస్తారనేది బహిరంగ ముచ్చట.. కానీ పట్టించుకునే వారుండరు. తలనీలాలు సమర్పించే చోట క్షురకులు ఒక్కో భక్తుడి వద్ద రూ.50కి పైగా, కొబ్బరియకాయలు కొట్టే చోట రూ.5 నుంచి 10 వసూలు చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తారే తప్ప చర్యలు తీసుకోరని పలువురు ఆరోపిస్తున్నారు.

● కానరాని ధరల సూచిక బోర్డులు

ఆలయ పాలక మండలి ఏడాదిన్నర క్రితం దుకాణాల వద్ద ధరల సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. ఇంత వరకు వాటి ఊసే లేకుండా పోయింది. ప్రతి దుకాణం ముందు ధరల సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు వాటిని నిత్యం పర్యవేక్షణ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇటీవల వీహెచ్‌పీ నాయకులు కొబ్బరికాయ కొట్టే వద్ద వసూళ్లు, అధిక ధరలకు వస్తువుల విక్రయంపై ఆందోళన వ్యక్తం చేశారు. చర్యలు తీసుకోవాలంటూ ఈవోకు వినతిపత్రం అందజేశారు. అయినా పట్టించుకునే వారు కరువయ్యారు. కొండపైన దుకాణాలు ఒక్కొక్కటి మాత్రమే ఉండడంతో వ్యాపారులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ భక్తులను దోచుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న దుకాణాలను ఒక్కో దాన్ని రెండు నుంచి మూడుకు పెంచాల్సి ఉంది.


కొండగట్టు ఈవోకు వినతిపత్రం ఇస్తున్న వీహెచ్‌పీ నాయకులు

బోర్డులు ఏర్పాటు చేయాలి
యాగండ్ల లక్ష్మీనారాయణగౌడ్, వీహెచ్‌పీ అధ్యక్షుడు



కొండగట్టులో వ్యాపారుల దోపిడీ అరికట్టడానికి ఆయా దుకాణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి. ధరల సూచికలతో భక్తులు దోపిడీకి గురికాకుండా చూడవచ్చు. కొందరు అధికారుల నిర్లక్ష్యంతోనే వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే మేమే బోర్డులు ఏర్పాటు చేస్తాం.

చర్యలు తీసుకుంటాం - పి.వెంకటేశ్, ఈవో



కొండపైన వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే తగు చర్యలు తీసుకుంటాం. దేవస్థానం నిబంధనల మేరకే వస్తువులు విక్రయించాల్సి ఉంటుంది. వ్యాపారులు, అర్చకుల నుంచి భక్తులకు ఇబ్బంది కలిగితే ఫిర్యాదు చేయాలి. వ్యాపార సంస్థలు, దుకాణాల ముందు ధరల సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

అంబేద్కర్ డిగ్రీ ప్రవేశానికి ఈ నెల 31 వరకు గడువు పొడిగింపు

గణేశ్‌నగర్, జనవరి 25: డాక్టర్ బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు గడువు ఈనెల 31 వరకు పొడిగించినట్లు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.టి.లక్ష్మీ, కోఆర్డినేటర్ డా.ప్రశాంత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్, ఐటిఐ, డిప్లొమా విద్యార్థులు, ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని రశీదు పొందాలని పేర్కొన్నారు. ఇతర సమాచారం కోసం 7382929755 ఫోన్ నంబర్‌కి కాల్ చేసి సంప్రదించాలని కోరారు.

ఎస్‌యూలో ఈ నెలతో ముగియనున్న రిటైర్డ్ అధ్యాపకుల సేవలు

గణేష్‌నగర్, జనవరి 25: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు రిటైర్డ్ ప్రొఫెసర్ల సేవలు జనవరి 31తో ముగియనున్నట్లు శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ సంకశాల మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీకి 12బి గుర్తింపులో న్యాక్ సాధించేందుకు కమిటీలో భాగస్వాములైన వివిధ విభాగాల రిటైర్డ్ అధ్యాపకులు భరత్, సాయిలు, పురుషోత్తం, వడ్నాల రమేష్, లక్ష్మణ్ సేవలు అభినందనీయమని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెలతో సేవలు ముగియనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

మానకొండూర్, జనవరి 25 : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఏనుగుల నాగరాజు (46) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. అన్నారం చెందిన నాగరాజు బుధవారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండగా హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

గోదావరిలో రెండు మృతదేహాలు లభ్యం

ఫైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25: గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోదావరి నదిలో గురువారం రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకునేందుకు నదిలో దూకగా మృతదేహాలు గురువారం తెల్లవారు జామున ఒడ్డుకు కొట్టుకువచ్చాయి. ఈమృతదేహాలు గోదావరిఖనికి చెందిన అజీమొద్దీన్(29), కొయ్యడ రాకేష్(33)గా పోలీసులు గుర్తించారు. రెండు రోజుల క్రితం అనారోగ్యకారణాలతో అజీమొద్దీన్ నదిలో దూకాడు. దూకిన చోటే అజీమొద్దీన్ మృతదేహం తేలింది. శివాజీ నగర్‌కు చెందిన రాకేష్ మానసిక స్థితి సరిగ్గాలేదని, ఈనెల 19న ఇంటి నుండి వెళ్లిన రాకేష్ ఇంటికి తిరిగి రాలేదు.

మైనింగ్ అండ్ జియాలజీ డైరెక్టర్‌ను కలసిన బ్రాహ్మణ సంఘం నేతలు

రామగిరి, జనవరి 25: రాష్ట్ర మైనింగ్ అండ్ జియాలజీ డైరెక్టర్‌గా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సుశీల్‌కుమార్‌ను గురువారం ఆయన ఛాంబర్‌లో రాష్ట్ర బ్రాహ్మణ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ జనరల్ సెక్రటరీ సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేదాంతం పవన్‌కుమార్, నాయకులు ఆదిత్య, నీలకంఠం కైలాష్‌లు పుష్పంగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.


డైరెక్టర్‌ను అభినందిస్తున్న బ్రాహ్మణ సంఘం నాయకులు

డివైడర్‌ను ఢీకొన్న బైక్ : ఇద్దరికీ గాయాలు

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండు ప్రాంతంలో గురువారం బైక్ డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో మండల కేంద్రానికి చెందిన బక్కి నితిన్, ఎర్రుల బన్నీ తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారిలో బన్ని పరిస్థితి విషమంగా మారడంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి

ఫైటింక్లయిన్‌కాలనీ, జనవరి 25: పోతనకాలనీ సమీపంలో గురువారం జరిగిన ప్రమాదంలో అడ్రియాల లాంగ్‌వాల్ కార్మికుడు బండ శశికుమార్(31) మృతి చెందాడు. మొదటి షిఫ్టుకు హాజరైన శశికుమార్ వ్యక్తిగత పనులు పూర్తి చేసుకుని సాయంత్రం సమయంలో ద్విచక్ర వాహనంపై గోదావరిఖని ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో లక్ష్మీపురం క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి అదుపుతప్పి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

సిరిసిల్ల క్రైమ్, జనవరి 25: సిరిసిల్ల పట్టణంలోని రగుడు బైపాస్ రోడ్డు వద్ద రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెలగొండ అభిలాష్ (20) అనే యువకుడు గురువారం రాత్రి హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెద్దూరుకు చెందిన అభిలాష్ ద్విచక్ర వాహనంపై సిరిసిల్ల బైపాస్ రోడ్డు నుంచి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామానికి చెందిన మహిళ నేరేళ్ల రాజవ్వ అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. గ్రామంలోని రాజవ్వ అనారోగ్యంతో పాటు గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదని పేర్కొన్నారు. ఈ నెల 2న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదని చెప్పారు. బంధువులు, చుట్టు పక్కల గాలించినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు.

రాజవ్వ కొడుకు జీవన్ ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

రాజన్న ఆలయ అభివృద్ధిపై త్వరలోనే సమీక్ష

● సర్పంచ్ ఎన్నికలపై త్వరలోనే నిర్ణయం ● రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

వేములవాడ, జనవరి 25 : రాష్ట్రంలోనే అతి పెద్ద శైవ క్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధిపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో త్వరలోనే సమీక్ష సమావేశం నిర్వహిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. గురువారం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధి జరగాల్సినంత జరగలేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో త్వరలోనే ఆలయ అభివృద్ధిపై సమీక్ష సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం, మేడారం సమ్మక్క సారక్క జాతర వంటివి మన పూర్వీకులు మనకు వారసత్వంగా ఇచ్చినటువంటివని ఇలాంటి ఆధ్యాత్మిక కేంద్రాలను అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. మన ఆలయాలు, సంస్కృతి దేశం మొత్తం తెలిసేలా విస్తృత ప్రచారం చేయడంతో పాటు పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులు మెచ్చేలా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. రాజన్న ఆలయం అభివృద్ధిలో తాము కూడా భాగస్వామ్యం అవుతామని చెప్పారు. రాష్ట్రంలో గ్రామపంచాయతీలకు ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదని, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన అంశంపై రెండు రోజుల్లో ప్రభుత్వ పరంగా నిర్ణయం తీసుకుంటామన్నారు. స్టేట్ ఫైనాన్స్ నిధులు ఇతర పనులకు వెచ్చించడం వల్లే సర్పంచ్‌ల బిల్లులు పెద్ద మొత్తంలో పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి తెలిపారు. నిధుల లభ్యత బట్టి సర్పంచుల పెండింగ్ బకాయిలను దశలవారీగా చెల్లించనున్నట్లు ఆమె తెలిపారు. ప్రతి పైసా ప్రజా సంక్షేమం కోసమే వెచ్చిస్తున్నామని స్పష్టం చేశారు.

విధ్వంస రాజకీయాలకు పాల్పడుతున్న కేటీఆర్

మాజీ మంత్రి కేటీఆర్ అధికారంలో లేకుండా ఒక్కరోజు కూడా ఉండలేకపోతున్నారని, అందుకోసమే కేటీఆర్ విధ్వంస రాజకీయాలకు పాల్పడుతున్నారని మంత్రి సీతక్క మండిపడ్డారు. గత పదేళ్లలో సామాజిక మాధ్యమాలలో ఉన్నది లేనట్టుగా చూపి కాలం గడిపారని, విదేశాలకు వెళ్లి నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్చుకొని వచ్చి ఇదే భాషగా చూపి నటించారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేక కేటీఆర్ ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని అన్నారు. తప్పుడు మాటలను ప్రజలు ఇకపై ఎట్టి పరిస్థితులలోనూ నమ్మలేని పరిస్థితి వచ్చిందని, ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన కేసీఆర్ ఇప్పటికీ ప్రమాణస్వీకారం చేయలేదని అన్నారు. కేటీఆర్ బుద్ధిగా ప్రతిపక్ష హోదాలో పనిచేస్తేనే ప్రజలు గుర్తిస్తారని లేదంటే ప్రజలు ఎప్పటికీ తిరస్కరిస్తూనే ఉంటారన్నారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి వారిని కోరుకున్నాని తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో తనది అన్న చెల్లెల్ల అనుబంధం అని, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆశీస్సులతో తను ప్రభుత్వ విప్‌గా, తాను మంత్రిగా సేవలు అందిస్తున్నామని సీతక్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, స్థానిక కాంగ్రెస్ నాయకులు ఈ సందర్భంగా ఆమె వెంట ఉన్నారు.



వేములవాడలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

రాజన్న సేవలో మంత్రి సీతక్క

వేములవాడ: రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సేవలో తరించారు. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు రాజన్నను దర్శించుకునే ఆనవాయితీలో భాగంగా గురువారం ఉదయం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్కకు తొలుత ఆలయ అర్చకులు అధికారులు సంప్రదాయ బద్ధంగా పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆమె శ్రీ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు మంత్రికి వేదోక్త ఆశీర్వచనం గావించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శ్రీ స్వామివారి శేష వస్త్రంతో సత్కరించగా, ఆలయ ఈవో డి కృష్ణ ప్రసాద్ శ్రీ స్వామివారి చిత్రపటం అందజేశారు. అంతకుముందు శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దర్శనం కోసం వచ్చిన మంత్రి సీతక్కను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఇతర అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు.

కార్యకర్తలపై అక్రమ కేసులు పెడితే ఊరుకోం

● ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని సబ్ జైలులో ఓ కేసులో అరెస్టు అయి ఉన్న బీఆర్ఎస్ నాయకుడు, హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డిని కవిత పరామర్శించారు. అనంతరం జగిత్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగగానే బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ సర్కారు అక్రమంగా కేసులు నమోదు చేయిస్తూ కక్ష పూరిత రాజకీయాలను చేస్తోందన్నారు. హబ్సీపూర్ సర్పంచ్ రాజేశ్వర్ రెడ్డిని సంబంధం లేని కేసులో ఇరికించి అరెస్టు చేసి జైలుకు పంపడం దారుణమన్నారు. ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి కక్షపూరిత వైఖరిని అవలంభిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానంతో ప్రజలను పువ్వుల్లో పెట్టుకొని చూసుకున్నామని వివరించారు. ఏ పార్టీ కార్యకర్తలపై అయినా తాము రాజకీయంగా పోరాటం చేశామే తప్ప చట్టాన్ని, పోలీసులను వినియోగించుకొని కక్షపూరితంగా వ్యవహరించలేదన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పనిచేస్తూ హామీల అమలుకు ప్రయత్నం చేయాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థినిలను మహిళా పోలీసులు జుట్టు పట్టి లాగి పడగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు డాక్టర్ గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్, పలువురు న్యాయవాదులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


జగిత్యాలలో జైలులో బీఆర్ఎస్ కార్యకర్తను పరామర్శించి వస్తున్న కవిత

ఎన్టీపీసీలో ఫొటోగ్రాఫర్ ఆత్మహత్య

జ్యోతినగర్, జనవరి 25: ఎన్టీపీసీ కృష్ణానగర్‌కు చెందిన రమేష్(36) అనే ఔట్‌డోర్ ఫొటోగ్రాఫర్ బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. 10 సంవత్సరాల క్రితం పెళ్లి చేసుకున్న రమేష్ రెండేళ్ల క్రితం విడాకులు తీసుకున్నాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెదిన రమేష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలాన్ని ఎన్టీపీసీ ఎస్ఐ జీవన్ పరిశీలించారు. మతుడి తల్లి సరోజన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ జీవన్ తెలిపారు.

ముస్లింల విద్యా ప్రమాణాల మెరుగుకు ఎంఐఎం కృషి

కరీంనగర్ టౌన్, జనవరి 25: ముస్లింల విద్యాప్రమాణాలు మెరుగుకు ఎంఐఎం కృషిచేస్తుందని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. సాలారే మిల్లత్ ఆల్ఇన్‌వన్ గైడ్స్ పంపిణీ కార్యక్రమం నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ కృషితోనే మైనారిటీ గురుకులాల అంకురార్పన జరిగిందన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా 2,024 గైడ్స్ అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జిహెచ్‌ఎంసి నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర నాయకుడు మహ్మద్ ఖైరుద్దీన్, సదర్ ఖాజీ మొఖయ్యర్ షాఖాన్, మౌలానా అబుల్ కలాం మిస్బాహి, ముఫ్తి యూసుఫ్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, నగర ప్రధానకార్యదర్శి బర్కత్ అలీ, హఫీజ్ మొయిజుద్దీన్ ఖాద్రీ యూసుఫ్, ఖమరుద్దీన్ తదితరులున్నారు.

'తన భర్త చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి'

ఎల్లారెడ్డిపేట, జనవరి 25: తమకు రావాల్సిన భూమిని పట్టా చేయించకుండా ఇబ్బందులకు గురి చేయడంతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగి వారం రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తన భర్త మరణించాడని దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన బానోతు జ్యోతి గురువారం ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె కథనం మేరకు... గ్రామంలోని జ్యోతి ఆమె భర్త నాజం కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. నాజం గ్రామ శివారులో 2.02 ఎకరాల భూమిని 12 ఏళ్ల కిందట కొనుగోలు చేశాడు. నాజం, గణేశ్‌లు అన్నదమ్ములు. కొనుగోలు చేసిన భూమిలో ఇద్దరు పంచుకోగా చేరో ఎకరం భూమి వచ్చింది. తన మరిది గణేశ్ పట్టా చేయిస్తానని నమ్మించి భూమి మొత్తం ఆయన పేరిట మార్చుకున్నట్లు తెలిపింది. మూడేళ్లుగా పేరుపై భూమి చేయకుండా తీవ్ర ఇబ్బందులకు గురి చేశాడని తెలిపింది. పలుమార్లు పంచాయతీ నిర్వహించిన పెద్దలు అర ఎకరం పట్టా చేయడంతో పాటు రైతు బంధు కింద వచ్చిన రూ.20 వేలు నాజంకు చెల్లించాలని చెప్పారని తెలిపారు. అందుకు అంగీకరించిన గణేశ్ పట్టించుకోలేదని తెలిపింది. నాజం ఆరు నెలల కిందట ఉపాధి నిమిత్తం దుబాయి దేశానికి వలస వెళ్లి 15 రోజుల కిందట స్వగ్రామానికి తిరిగి వచ్చాడు. గణేశ్ తనకు భూమి చేయకపోవడంపై తన భర్త నాజం మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసినట్లు జ్యోతి తెలిపింది. వారం రోజులుగా సిరిసిల్ల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 24న మృతిచెందినట్లు తెలిపింది. తన భర్త చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. లేని పక్షంలో తమ కుటుంబంతో కలిసి ఆందోళనకు దిగుతామని హెచ్చరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమాకాంత్ తెలిపారు.

భూసర్వే నిలిపివేయాలని రైతుల నిరసన

మెట్‌పల్లి రూరల్, జనవరి, 25 : మండలంలోని పలు గ్రామాల మీదుగా 63వ జాతీయ రహదారి కోసం అధికారులు చేస్తున్న భూ సర్వే ఆపాలని రైతులు అర్ధనగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. బండలింగాపూర్, వెల్లుల్ల, మేడిపల్లి గ్రామాల్లో అధికారులు గురువారం భూ సర్వే చేస్తుండగా రైతులు అర్ధనగ్న ప్రదర్శనతో రిలే దీక్షలో నిరసన తెలపడంతో అధికారుల సర్వేను నిలిపివేసి వెనుతిరుగారు. దీక్షలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల, జనవరి 25 : కోరుట్ల, మెట్‌పల్లి మున్సిపల్ పరిధితో పాటు నియోజకవర్గంలో వివిధ మండలాలలోని గ్రామాలలో పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి సమస్యలను పరిష్కరించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అధికారులకు సూచించారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయితీ రాజు, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో జరుగుతున్న పనుల వివవరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ నీరు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రాజేశ్వర్ పాల్గొన్నారు.

జీవో నం 55ను వెనక్కి తీసుకోవాలి

ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నందు



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాల అర్బన్, జనవరి 25: వ్యవసాయ యూనివర్సిటీ భూములను హైకోర్టుకు కేటాయిస్తూ ఇచ్చిన జీవో.నెం 55 వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనువాడ నందు డిమాండ్ చేశారు. ఏ బీ వీపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ వద్ద నిరసన తెలుపుతూ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ, విద్యార్థుల పైన పోలీసులు క్రూరంగా ప్రవర్తించిన తీరుకు నిరసన తెలిపారు. నందు మాట్లాడుతూ బాధ్యులైన పోలీసులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి వర్సిటీ భూములను కాపాడేందుకు జీవో రద్దుకు చొరవచూపాలన్నారు. హాస్టల్స్ కన్వీనర్ నీరటి శ్రీనివాస్, మనోహర్, ప్రశాంత్, జస్వంత్, రంజిత్, శివాజీ నాయకులు, విద్యార్థులున్నారు.

●ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీపై దాడి చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని భారత్ సురక్షా సమితి నాయకులు డిమాండ్ చేశారు. వ్యవసాయ యూనివర్సిటీ భూముల కేటాయింపు జీవోను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. సంఘ బాధ్యులు ఏసీఎస్ రాజు, అక్కినపల్లి కాశీనాథం, గంగాధర్, పోచమల్లు, భూమన్న తదితరులున్నారు.

కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలి

కోరుట్ల, జనవరి 25 : వ్యవసాయ ఉద్యానవన యునివర్సిటీలో హైకోర్టు నిర్మాణానికి భూమిని కేటాయించడాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై నిరసన తెలిపారు. పట్టణంలోని కార్గిల్ చౌరస్తాలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న పోలీసులు చేరుకోని ఆందోళన విరమింప జేశారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు మ్యాడవేని సునిల్, వినయ్, మహదేవ్, శివ, సూరజ్, రంజిత్, లక్కిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

'యువత బంగారు భవిష్యత్‌కు మోదీ గ్యారెంటీ'

జగిత్యాల అర్బన్, జనవరి 25: యువత బంగారు భవిష్యత్‌కు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గ్యారంటీ ఉంటారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బోగ శ్రావణి అన్నారు. జిల్లా కేంద్రంలోని శుభమస్తు కన్వెన్షన్‌లో నమో నవ్వద్దత సమ్మేళనంలో భాగంగా మోదీ నిర్వహించిన వర్చువల్ కార్యక్రమంలో పాల్గొని తిలకించారు. మోదీ విజన్‌ను నవ యువ ఓటర్లతో పంచుకున్నారు. దేశానికి బలమైన యువత నేడు మోదీ సారధ్యంలో అభివృద్ధి వైపు పరుగులు పెడుతుందన్నారు. యువత ఆశయాలకు అనుగుణంగా మోదీ సర్కార్ ముందుకు సాగుతుందన్నారు. ప్రతి ఓటరు తన ఓటు హక్కుతో ప్రతిధ్వనించాలని కోరతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, బీజే వైయం నాయకులు, కార్యకర్తలతో పాటు, విద్యార్థులు పాల్గొన్నారు.

రామాలయంలో మహా యాగం

మెట్‌పల్లి, జనవరి, 25 : పట్టణంలోని కోదండ రామాలయంలోని గార్డెన్‌లో లోక కల్యాణార్థం కోసం మహా యాగం కార్యక్రమాలను వేదపండితులు నిర్వహించారు. గురువారం పౌర్ణమి సందర్భంగా లోక కల్యాణార్థం శ్రీ విష్ణు సహస్రనామ, శ్రీ లలితా సహస్రనామ మూల మంత్ర హవనం, 108 జంటలతో మహా యాగం కార్యక్రమాలను స్వర్ణకార, మన్మయ విశ్వబ్రహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరిపించారు. వేద పండితులు శ్రీచంద్రమౌళి, ఈశ్వర్ స్వామి, శ్రీపాద లక్ష్మీనరసింహశాస్త్రిలు ఉదయం నుంచి గణపతి పూ., శ్రీచక్రార్చన, మహా యాగం, పూర్ణాహుతి, మంత్రపుష్పం, మంగళహారతి వంటి కార్యాక్రమాలను జరిపించారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు పులిమామిడి చంద్రయ్య, ఇల్లెందుల శ్రీధర్, దురిశెట్టి నటరాజ్, గిరిధర్, కోటగిరి సంతోష్, నాయకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

హైదరాబాద్ బయల్దేరి వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

కోరుట్ల, జనవరి 25 : హైదరాబాదు మహానగరంలోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశంకు కోరుట్ల నియోజకవర్గ నాయకులు గురువారం తరలి వెళ్లారు. నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల ద్వార హైదరాబాదు బయలు దేరి వెల్లారు. వాహనాల శ్రేణీలను కాంగ్రెస్ నాయకులు జెండాలను ఊపి ప్రారంభించారు. హైదరాబాదు బయలు దేరివెల్లిన వారిలో తిరుమల గంగా ధర్, జెట్టి లింగం, కొంత రాజం, మహిపాల్ రెడ్డి ఉన్నారు.

జాతీయ స్థాయిలో మెరిసిన ఆదర్శ విద్యార్థులు

గొల్లపల్లి, జనవరి 25: రంగోత్సవ్ సెలబ్రేషన్స్ ముంబాయి నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో గొల్లపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఇంగ్లీష్ హ్యాండ్ రైటింగ్, గ్రీటింగ్ కార్డు, స్కెచింగ్, కలరింగ్, టాటూ, వేలిముద్రల చిత్రీకరణ, కార్టూన్ మేకింగ్ తదితర తొమ్మిది రకాల పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన 60 మంది విద్యార్థులు బహుమతులు, అవార్డులు సాధించారు. 26 మంది బంగారు పతకాలు, 15 మందికి వెండి, 12 మందికి కంచు పతకాలతో పాటు నాలుగు ప్రత్యేక బహుమతులు, మూడు అవార్డులు సాధించినట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఈరవేణి రాజ్ కుమార్‌కు కల్చరల్ ఆక్టివిటీస్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా వీరికి జిల్లా పంచాయతీ అధికారి నవీన్, ఎంపీడీవో నవీన్, రంగోత్సవ్ కో ఆర్డినేటర్ రాజశేఖర్ చేతులమీదుగా బహుమతులు, అవార్డులు అందుకున్నారు. వైస్ ప్రిన్సిపాల్ నగేష్, గైడ్ టీచర్ జీవి రమణ, ఉపాధ్యాయులు అరుణ్, రాజశేఖర్, రమాదేవి, హరిప్రియ, సంధ్య, రజిత పాల్గొన్నారు.

ఓటింగ్‌పై విద్యార్థులకు అవగాహన

బుగ్గారం, జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం మండలం లోని వెల్గొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల ఓటింగ్ పట్ల అవగాహన కల్పించారు. పాఠశాల నాయకున్ని ఎన్నుకోవడానికి ఎన్నికల అధికారులు, ఏజెంట్లుగా విద్యార్థులు వ్యవహరించారు. మిగతా విద్యార్థులు అందరూ ఓటింగ్‌లో పాల్గొని తమ నాయకున్ని ఎన్నుకోవడానికి ఓట్లు వేశారు. ఈ ఎన్నికల్లో పాఠశాల నాయకుడిగా బండ చందు, ఉప నాయకురాలిగా వైష్ణవి ఎన్నికయ్యారు.

విద్యావంతులు ఓటర్లలో చైతన్యం తీసుకురావాలి



గురుకులం విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న కలెక్టర్



ప్రతిజ్ఞ చేస్తున్న అదనపు ఎస్పీ, పోలీస్ అధికారులు



కోరుట్లలో మాట్లాడుతున్న ఆర్‌డీవోలు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 25: విద్యావంతులు ఓటర్లలో చైతన్యం కలిగించాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవంపై విద్యార్థులకు నాటిక పోటీలను గురువారం నిర్వ హించారు. పోటీలలో ప్రతిభ కనబ రించిన మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని తెలంగాణ రాష్ట్ర గురుకుల కళాశాల విద్యార్థులు మొదటి బహుమతి గెలుపొం దగా వారికి అదనపు కలెక్టర్లు లత, దివాకర్, స్వీప్ జిల్లా అధికా రులతో ఆమె అందజేసి అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఓటు ఆయుధం లాంటిదని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్, పద్యకవి వెంకట్, విద్యార్థులు పాల్గొన్నారు.

● కోరుట్ల: ప్రతి పౌరుడు ఓటు హక్కుపై అవగాహన కలిగి ఉండాలని కోరుట్ల, మెట్‌పల్లి ఆర్‌డీఓలు రాజేశ్వర్, మధులు అన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించు కుని పట్టణంలో బీఎల్ఓలు, విద్యార్థులు, వివిధ శాఖల అధికా రులతో కలిసి ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ర్యాలీలో కోరుట్ల మెట్‌పల్లి ఆర్‌డీఓలు రాజేశ్వర్, మధులు పాల్గొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి విద్యార్థులతో కలిసి అవగాహన ర్యాలీ జరిపారు. నంది చౌరస్తాలో విదార్థులు మానవహారం చేపట్టారు. విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ కిషన్, కోరుట్ల సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ కిరణ్ కుమార్, ఎంఈవో నరేశం ఉన్నారు.

● జగిత్యాల టౌన్ : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కు రించుకుని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ అధికా రులు ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు భీమ్‌రావు, జనార్ధన్ రెడ్డి, ఏవో అమరేనాథ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐలు ఉన్నారు.

● రాయికల్: రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎండీ ఖయ్యూం అన్నారు. రాయికల్ తహసీల్దార్ కార్యాలయంతో పాటు అన్ని గ్రామాల్లో గురువారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్, ఎంఈవో గంగాధర్ పాల్గొన్నారు.

● కొడిమ్యాల: మండల కేంద్రంలోని రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని గురువారం తహసీల్దారు రవికాంత్, ఎంపీడీవో పద్మజరాణి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఓటరు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఏపీవో సతీష్, సూపరిండెంట్ సెరేందర్, సీనియర్ అసిసిస్టెంట్ సురేష్, ప్రసాద్, ఎంపీవో ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

● పెగడపల్లి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పెగడపల్లి తహసీల్దార్ ఎం.ఏ.ఫారూక్ పేర్కొన్నారు. గురువారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.పుల్లయ్య, ఎంపీవో మహేందర్, నాయబ్ తహసీల్దార్ విష్ణువర్ధన్, గిర్దావర్ శ్రీనివాస్, ఆంజనేయులు పాల్గొన్నారు.

● వెల్గటూర్ : ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు కీలకమని తహసీల్దార్ శేఖర్ పేర్కొన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా వెల్గటూర్ మండలంలో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. తహశీల్దార్ శేఖర్ ప్రధానోపాధ్యాయుడు నందయ్య, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

● మెట్‌పల్లి రూరల్: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి ఎంపీడీవో భీమేష్‌రెడ్డి అన్నారు. అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

● కథలాపూర్: మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రహమాన్, తహసీల్దార్ ముంతాజీబోద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ నాగేశ్, సర్పంచ్ కంటె నీరజ సత్యనారాయణ పాల్గొన్నారు.

● బుగ్గారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కుపై అవగాహన కల్పిం చారు. తహసీల్దార్ మజీద్ మాట్లడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని అన్నారు. తహసీల్దార్ మజీద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ బాబురెడ్డి, ఎంపీడీవో తిరుపతి, గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ నగునూరి రామక్రిష్ణ ఉన్నారు.

●ధర్మపురి: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ధర్మపురి తహసీల్దార్ కృష్ణచైతన్య కోరారు. జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకుని ధర్మపురి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓటు గురించి అవగాహన కల్పించారు.

ధర్మపురి మున్సిపల్ కమిషనర్ సీహెచ్ రమేష్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో నరేష్‌కుమార్, పీఆర్ ఏఈఈ ముకరం, ఆర్ఐలు వెంకటేష్, రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

● మల్యాల: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు గొప్ప ఆయుధం అని ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు పేర్కొన్నారు. మల్యాల అంగడి బజారులో ఓటు హక్కును సద్వినియోగం చేసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ మునీందర్, ఆర్ఐ తిరుపతి, సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్ వివిద శాఖల ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



కథలాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



రాయికల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న తహసీల్దార్, సిబ్బంది

విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



మెట్‌పల్లి మురికి కాలవను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

మెట్‌పల్లి, జనవరి, 25 : విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మహాత్మ జ్యోతి బాపూలే సంక్షేమ గురుకుల పాఠశాల నిర్వాహకులకు ఆదేశించారు. గురువారం ఆయన ఆకస్మికంగా పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయులు ఆటలు ఆడిపిస్తుండగా వారితో సరదాగా లాంగ్ జంప్ చేసి విద్యార్థులను ఉత్తేజ పరిచారు. పాఠశాలలోని వంట గది, బోజనశాల, స్టోర్ రూమ్‌లతో పాటు తరగతి గదులను పరిశీలించి హాస్టల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆహారం మెన్ ప్రకారం పెట్టడం లేదని, వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని పద్ధతి మార్చుకోకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయన వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.

పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి

పట్టణంలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మున్సిపల్ అధికారులకు సూచించారు. గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమంలో భాగంగా గురువారం మెట్‌పల్లి పట్టణంలోని 12వ వార్డులలోని ఆయన సందర్శించారు. కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. మురికి కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరిచే విధంగా జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ బంగారుకాళ్ల కిషోర్, నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం

బీర్‌పూర్, జనవరి 25: ఓటు హక్కు వినియోగంపై పాటను చిత్రీకరించి గుర్తింపు పొందిన మండల యువకుడు బోగె అశోక్ గురువారం గవర్నర్ చేతుల మీదుగా రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి అందుకున్నారు. మండలంలోని కొల్వా యి గ్రామానికి చెందిన బోగె అశోక్ ఓటు హక్కు వినియోగంపై ప్రత్యేకమైన పాటను రూపొందించాడు. స్వీప్ సాంగ్ కేటగిరీలో జరిగిన ఎంపికలో అశోక్ చిత్రీకరించిన సాంగ్ రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతికి ఎంపికైంది. హైదరాబాద్‌లో గురువారం గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా బహుమ తి అందుకన్నారు.

బెస్ట్ అంబాసిడర్ అవార్డు అందజేత

మెట్‌పల్లి, జనవరి, 25: హక్కు వినియోగం చేసుకోవడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని అవగాహన కల్పించిన మెట్‌పల్లిలోని సాహితి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థి మామిడాల మాధవి బెస్ట్ అంబాసిడర్ అవార్డును అందుకున్నారు. గురువారం 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ వారు నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ తమిళసై సౌందర్ రాజన్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈవో చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ చంద్రప్రకాష్ తెలిపారు. మాధవిని కళాశాల డైరెక్టర్లు సంతోష్‌కు మార్, హరిప్రసాద్ అభినందించారు.

రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్న కేజీబీవీ విద్యార్థినులు

కొడిమ్యాల, జనవరి 25 : మండలంలోని సంద్రల్లపల్లి కేజీబీవీ పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థినిలు జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా గురువారం హైదరాబాదులోని కూకట్‌పల్లి జేఎన్‌టీయూలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ చేతుల మీదుగా అవార్డు ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు ప్రత్యేక అధికారి ఎం. లింగవ్వ తెలిపారు. కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతికి చెందిన విద్యార్థినిలు బి. రుచిత, ఎ. మనీషా, ఎ. గంగోత్రి, ఇ. సౌమ్య, ఎ. హేమ భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జాతీయ ఎన్నికల దినోత్సవం సందర్భంగా సెప్టెంబరు 23, 2023న క్రేతాన్ విభాగంలో స్వీప్ భవిష్యత్తు ఓటర్లు అనే స్కిట్‌లో పాల్గొని జిల్లాలో ప్రథమ స్థానాన్ని పొందారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ఎంపికై రాష్ట్ర స్థాయిలో ప్రథమంగా అవార్డు ప్రశంసా పత్రాలను పొందినట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ చీఫ్ ఎల క్టోరల్ ఆఫీసర్ వికాస్‌రాజ్, రాష్ట్ర ఎన్నికల అధికారి పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి అవార్డు పొందిన విద్యార్థినిలను ప్రత్యేక అధికారి, సిబ్బంది అభినందించారు.

ట్యాబ్‌లు అందుకున్న విద్యార్థినులు

మండలంలోని సంద్రల్లపల్లి కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థినిలు అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా పదవ తరగతి చదువుతున్న ఎస్. నందిని, ఎస్ హన్మలత జిల్లా కలెక్టర్ షేక్ యాస్మీన్‌బాషా చేతుల మీదుగా ట్యాబ్‌లు అందుకున్నట్లు ప్రత్యేక అధికారి లింగవ్వ తెలిపారు.

క్రీడల ద్వారా మానసికోల్లాసం : జూనియర్ జడ్జి శ్యాంప్రసాద్

ధర్మపురి, జనవరి 25: క్రీడల ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్ అన్నారు. గణతంత్ర దినోత్సవం పురస్కరించుకుని స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులకు స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌ను పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రాజేష్‌తో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులకు క్రీడలు ఉపశమనం కలిగిస్తాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే ప్రతి ఒక్కరూ టీమ్ వర్క్‌గా, పాజిటివ్‌గా తీసుకోవాలన్నారు. క్రీడలు ఆత్మ విశ్వాసం నింపుతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం సత్యనారాయణరెడ్డి, న్యాయ వాదులు గడ్డం లింగారెడ్డి, రౌతు రాజేష్, అలుక వినోద్, బందెల రమేష్, మామిడాల శ్రీకాంత్, రామడుగు రాజేష్, గూడ జితేందర్‌రెడ్డి, సంబరాజుల కార్తీక్, జాజాల రమేష్, కరవత్తుల భావన, బత్తిని ఇంద్రకరణ్, కస్తూరి శరత్, కలమడుగు కీర్తి తదితరులు పాల్గొన్నారు.

నవ సమాజ నిర్మాణంలో పాత్రికేయులది కీలక పాత్ర

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



ప్రెస్‌క్లబ్ జేఏసీ ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

రాయికల్, జనవరి 25: నవ సమాజ నిర్మాణంలో పాత్రికేయులది కీలక పాత్ర అని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. రాయికల్ పట్టణంలోని వర్తక సంఘ భవనంలో రాయికల్ మండల ప్రెస్‌క్లబ్ (జేఏసీ) కార్యవర్గ ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాత్రికేయులతోనే సమాజంలోని అనేక సమస్యలు పరిష్కారమయ్యాయన్నారు. పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తానని, ప్రెస్‌క్లబ్ భవనం, పాత్రికేయులకు ఇళ్ల స్థలాల మంజూరుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ప్రెస్‌క్లబ్ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ఎంపీపీ సంధ్యారాణిసురేందర్ నాయక్, జడ్పీటీసీ అశ్విని జాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ గండ్ర రమాదేవిఅచ్యుత్ రావు, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంతోష్, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజరెడ్డి, తహసీల్దార్ ఖయ్యూం, జగిత్యాల ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చీటి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి ప్రదీప్, రాయికల్ మండల ప్రెస్‌క్లబ్ జేఏసీ అధ్యక్షుడు వాసరి రవి, ప్రధాన కార్యదర్శి కడగుంట్ల జగదీశ్వర్ పాల్గొన్నారు.

●మండలంలోని బోర్నపెల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు తొడసం జైతుకు దివ్యాంగుడిని సకలాంగులు వివాహం చేసుకున్న పథకంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన కల్యాణ లక్ష్మితో పాటు అదనంగా మంజూరైన రూ.లక్ష ప్రొసీడింగ్‌ను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ సంధ్యారాణిసురేందర్ నాయక్, జడ్పీటీసీ అశ్విని జాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు కోల శ్రీనివాస్, సర్పంచ్ పాదం లతరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు రవీందర్ ఉన్నారు.

●మండలంలోని ఇటిక్యాల గ్రామ బీఆర్ఎస్ నాయకుడు అంకతి శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో గాయపడి మరణించగా వారి కుటుంబసభ్యులను ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ లావుడ్య సంధ్యారాణి సురేందర్ నాయక్, జడ్పీటీసీ అశ్విని జాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ మారంపెల్లి రాణిసాయి కుమార్, వైస్ చైర్మన్ బర్కం మల్లేశం, మండల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కథలాపూర్ : హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో గురువారం రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ కమిటీ సభ్యుల సమావేశానికి కథ లాపూర్ నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్‌రెడ్డి ఉన్నారు.

●శ్రమకు తగిన ఫలితం దక్కాలని కార్మిక, కర్షకుల పక్షాన పోరాటాలు చేసిన మహబూబ్ అలీ సేవలు మరువలేనివని సీపీఐ మండల నాయకుడు, తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుతారి రాములు పేర్కొన్నారు. మండలంలోని సిరికొండలో కార్మిక నేత మహబూబ్ అలీ 25వ వర్ధంతి నిర్వహించారు.

బీర్‌పూర్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో గురువారం తహసీల్దార్ నరేష్ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. ఆర్ఐ శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్ సర్పంచ్ అంకం మమత సస్పెన్షన్ ఉత్తర్వులు నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా గురువారం ఆదేశాలు జారీ చేశారు. సర్పంచ్ మమత తన సస్పెన్షన్‌ను సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించగా మమత సస్పెన్షన్‌ను నిలిపివేస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది.

●జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామపంచాయితీ భవన నిర్మాణానికి రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి నీటి పారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి లేఖ రాశారు.

మల్యాల: మల్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగ మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా గురువారం మృతుని కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, సర్పంచ్ మిట్టపల్లి సుదర్శన్, సింగిల్ విండో చైర్మన్ ముత్యాల రాంలింగారెడ్డి, అయిల్నేని సాగర్ రావు, ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసం శివ, మండల కోఆప్షన్ సభ్యుడు ఎం.డీ.అజర్, నాయకులు పోతరాజు శ్రీనివాస్, తాటిపాముల జగదీశ్వర్, శ్రీనివాస్‌రెడ్డి, మల్యాల గణేష్, సల్మాన్, సంగ సత్యనారాయణ తదితరులు ఉన్నారు

కొడిమ్యాల: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గురువారం డిగ్రీ కళాశాలలో చేరుటకు ఎస్.ఆర్.ఆర్. కాలేజీ(అటానమస్)ని ఎంపిక చేసుకోవాలని కోరుతూ డిగ్రీ కళాశాల లెక్చరర్లు ప్రచారం చేశారు. ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ఎస్.ఆర్.ఆర్ కాలేజీ లెక్చరర్లు ఉన్నత విద్య అవకాశాలు, డిగ్రీ, పీజీలో లభించే వివిధ కోర్సులు, హాస్టల్ వసతులపై అవగాహన కల్పించారు.

బుగ్గారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులచే ర్యాలీ నిర్వహించి, విద్యార్థులకు ఓటు హక్కు గురించి అవగాహన కల్పించారు. తహసీల్దార్ మజీద్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్,ఆర్ఐ బాబు రెడ్డి, ఎంపీడీవో తిరుపతి, గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ నగునూరి రామక్రిష్ణ పాల్గొన్నారు.

వెల్గటూర్: వెల్గటూర్ క్రికెట్ క్రీడాకారులకు గురువారం కాంగ్రెస్ నాయకుడు మెరుగు నరేష్ గౌడ్ 20 మంది క్రీడాకారులకు సర్పంచ్ మెరుగు మురళి చేతుల మీదుగా క్రీడా దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సందీప్‌రెడ్డి, గండ్ర శ్రీకాంత్‌రావు, గుమ్ముల వెంకటేష్, సంతోస్, అజయ్, ప్రవీణ్, సాయి, వేణు, సంతోస్, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండలంలోని పలు అభివృద్ధి పనులు ప్రారంభించడానికి ఈ నెల 27న జాతీయ సహకార బ్యాంక్‌ల సమాఖ్య అధ్యక్షుడు, రాష్ట్ర సహకార అపెక్స్, కేడీసీసీ కరీంనగర్ బ్యాంక్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, చొప్పదండి ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం రానున్నట్లు ఎంపీపీ మెస్నేని స్వర్ణలత, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు తెలిపారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ నాచుపల్లి గ్రామంలో 26 లక్షల 16 వేల రూపాయలతో నిర్మించిన దుకాణా సముదాయం, 20లక్షల రూపాయలతో నిర్మించిన పల్లె దవఖానా భవ నాలను ప్రారంభిస్తారన్నారు. మండల కేంద్రంలో 29 లక్షల రూపాయలతో నిర్మించిన కేడీసీసీ బ్యాంక్ స్ట్రాంగ్ రూం, రికార్డు గది, మండలంలోని తిర్మాలాపూర్ గ్రామంలో 20 లక్షల రూపాయలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని. అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభి స్తారని తెలిపారు.